# బడుగులు సలసల

నమస్తే తెలంగాణ
www.ntnews.com



సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో అభివాదం చేస్తున్న పద్మశాలీ సంఘం నాయకులు

## 18 లక్షల మంది పద్మశాలీలు ఏమైనట్టు?

- 2011లో 12 లక్షల మంది ఉండగా.. తాజా సర్వేలోనూ అదేలెక్క
- పద్మశాలీలపై కాంగ్రెస్‌కు అక్కసు
- ఆ సంఘం అధ్యక్షుడు రాజ్‌కుమార్

ఖైరతాబాద్, ఫిబ్రవరి 8: రాష్ట్రంలో 18 లక్షల మంది పద్మశాలీలు ఏమైయ్యారని పద్మశాలీ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రాజ్‌కుమార్ రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. హైదరాబాద్ సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో శనివారం మీడియాతో ఆయన మాట్లాడారు. 2011లో నిర్వహించిన సర్వేలో 12 లక్షల మంది పద్మశాలీలు ఉన్నారని, ఇప్పుడు తాజాగా కాంగ్రెస్ సర్కార్ నిర్వహించిన సర్వేలోనూ అదే 12 లక్షల మంది ఉన్నట్టు లెక్కలు చూపారని తెలిపారు. దశాబ్దకాలం దాటినా అదే సంఖ్య చూపడం సిగ్గుచేటని పేర్కొన్నారు. వాస్తవంగా రాష్ట్రంలో 30 లక్షల మంది వరకు ఉన్నారని, మిగతావారంతా ఏమైనట్టు అని నిలదీశారు. కాంగ్రెస్ ప్రభుత్వం పద్మశాలీలను వంచించిందని ధ్వజమెత్తారు. ప్రభుత్వ లెక్కలు చూస్తే పద్మశాలీల ఆత్మగౌరవం దెబ్బతినేలా ఉన్నదని మండిపడ్డారు. ప్రభుత్వం నుంచి ఆదరణ లేక అనేక మంది ఆత్మహత్యలకు పాల్పడ్డారని ఆవేదన వ్యక్తంచేశారు. సమావేశంలో సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అప్పం శ్రీనివాస్, కోశాధికారి నవీన్, గౌరవ అధ్యక్షుడు వేముల బాలరాజు, మల్లేశ్, ఉపాధ్యక్షులు వనమాల శంకర్, సీహెచ్ చంద్రుడు, గుండి నగేశ్, సూర్యప్రకాశ్, శ్రీనివాస్, వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

## సర్కార్ కులగణన బూటకం

- సామాజిక, బీసీ, ప్రజాసంఘాల జేఏసీ

హైదరాబాద్, ఫిబ్రవరి8 (నమస్తే తెలంగాణ): సర్కార్ కులగణన బూటమని సామాజిక, బీసీ, ప్రజాసంఘాల నేతలు ధ్వజమెత్తారు. కుల నిర్మూలన వేదిక అధ్యక్షుడు పాపని నాగరాజు, బీసీ ఇంటలెక్చువల్ ఫోరం కో-ఆర్డినేటర్ పర్వతం వెంకటేశ్వర్, బీసీ పొలిటికల్ జేఏసీ కో కన్వీనర్ మాలి కరుణాకర్, ఏబీజేఎస్ న్యాయవేదిక అధ్యక్షుడు కెడల ప్రసాద్, బీసీ రిజర్వేషన్ పోరాట సమితి అధ్యక్షుడు కోట్ల వాసుదేవ్ సంయుక్తంగా ఒక ప్రకటన విడుదల చేశారు. కులగణన పేరిట ప్రభుత్వం ఎస్సీ, బీసీ జనాభాను తగ్గించి ఓసీ జనాభాను పెంచి చూపిందని విమర్శించారు.

# కులగణనలో కాంగ్రెస్ విఫలం

- సంఖ్య పెరిగితే బీసీలు వాటా అడుగుతారని భయం
- రాజకీయ చైతన్యం పెరుగుతుందనే కులాల లెక్క చెప్పలేదు
- డొల్లతనంతో నైతికత కోల్పోయిన రేవంత్‌రెడ్డి ప్రభుత్వం
- 'నమస్తే తెలంగాణ' ఇంటర్వ్యూలో ప్రొఫెసర్ సింహాద్రి



హైదరాబాద్, ఫిబ్రవరి 8 (నమస్తే తెలంగాణ): కులగణన సర్వేను సమగ్రంగా చేపట్టడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని ఓయూ రిటైర్డ్ ప్రొఫెసర్ సింహాద్రి పేర్కొన్నారు. బీసీల సంఖ్య పెరిగితే వారు తమకు దక్కాల్సిన వాటా అడుగుతారనే భయంతో వారిని ప్రభుత్వం తక్కువ చేసి చూపిందని మండిపడ్డారు. కులాల లెక్కలు చెప్తే వారిలో రాజకీయ చైతన్యం పెరుగుతుందనే ఉద్దేశంతో ప్రభుత్వం వారి వివరాలను వెల్లడించలేదని చెప్పారు. సమన్వయ లోపం, పాలనలో డొల్లతనంతో ప్రభుత్వం తన నైతికతను కోల్పోయిందని విమర్శించారు. గురువారం 'నమస్తే తెలంగాణ'కు ఇచ్చిన ఇంటర్వ్యూలో కులగణన సర్వేలో లోపాలను ఆయన ఎత్తిచూపారు.

**నమస్తే తెలంగాణ: కులగణనపై ప్రభుత్వ తీరును ఎలా విశ్లేషిస్తారు?**

**సింహాద్రి:** కులగణనతో సామాజిక న్యాయం సాధ్యమని రాజ్యాంగం స్పష్టం చేస్తున్నది. 'కులగణన'పై ప్రజల్లో అవగాహన కల్పించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమయింది. 2014లో బీఆర్‌ఎస్ చేసిన సమగ్ర కుటుంబ సర్వే, కాంగ్రెస్ చేసిన కులగణన డాటా మన ముందున్నది. అయితే ఆనాడు 51 శాతం ఉన్న బీసీ జనాభాను 46 శాతానికి తగ్గించి చూయించడం దారుణం. ఈ విషయంలో కాంగ్రెస్ సర్కారు బీసీ వ్యతిరేకత స్పష్టంగా బయటపడింది. రాహుల్ గాంధీ కులగణనపై చెప్పున్న లక్ష్యాలకు విరుద్ధంగా సర్వే జరిగింది. రాష్ట్రంలో ప్రభుత్వాన్ని నడుపుతున్న వారు మొదటి నుంచి కులగణనకు సుముఖంగా లేరు. తాజా సర్వేలో బీసీల జనాభాను 22 లక్షలు తగ్గించారు. వీరితోపాటు ఎస్సీల జనాభాను తగ్గించి చూపారు. బీసీల లెక్కను సమగ్రంగా అడ్రస్ చేయడంలో ప్రభుత్వం విఫలం అయింది.

> **జనాభా వివరాలు అసమగ్రంగా ఉన్నాయన్న వాదనలపై మీ అభిప్రాయం?**
>
> కులగణన గణాంకాలు చూస్తే సర్వే అసమగ్రంగా జరిగినట్టు స్పష్టమవుతున్నది. ఓసీల సంఖ్యను 16 లక్షలకు పెంచి, బీసీల సంఖ్యను 22 లక్షలు తగ్గించారు. ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లపై బీసీలు తిరగబడుతున్నారు. దీంతో తమ జనాభా 10 శాతం కాదని 15 శాతం ఉన్నామని చెప్పడానికి ఏకపక్షంగా జనాభాను పెంచి చూపిస్తున్నారు.

**ఉపకులాల వారీగా వివరాలను ప్రభుత్వం ఇంతవరకు వెల్లడించలేదు. దీంట్లో ఏమైనా కుట్ర దాగి ఉందా?**

ఈ కులగణన సర్వేలో ప్రభుత్వం ప్రాథమిక సమాచారాన్ని చూపింది. అసెంబ్లీ ప్రత్యేక సమావేశంలో పూర్తి రిపోర్టు పెట్టాల్సి ఉన్నా ప్రభుత్వం ఆ దిశగా ప్రయత్నం చేయలేదు. కులాల వారీగా వారి విద్య, నిరక్షరాస్యత, ఉద్యోగభద్రత, ఇండ్లు, కులవృత్తుల పరిస్థితి, ఆదాయం, దారిద్ర్య రేఖకు దిగువన ఉన్న కుటుంబాలు (బీపీఎల్), మధ్యతరగతి కుటుంబాలు, ఆయా కులాల వారికి ఉన్న భూములు, సంపద, మౌలికవసతులు వంటి 56 పారామీటర్ల డాటాను ప్రభుత్వం సమగ్రంగా అసెంబ్లీ ముందు ఉంచాలి. వీటన్నింటిని మెరుగుపర్చడానికి ప్రభుత్వం వద్ద సమగ్ర ప్రణాళిక లేదని తేలిపోయింది. కులగణనపై ప్రాథమిక లెక్కలు వెల్లడించి ఏదో సాధించాం అని చెప్పడం ఏంటి? తమ పార్టీ అగ్రనాయకుడు రాహుల్‌గాంధీనే తప్పుదోవ పట్టించేలా సీఎం రేవంత్‌రెడ్డి వ్యవహరిస్తున్నారు. సర్వేతో ప్రభుత్వం డొల్లతనం, నిబద్ధత ఏ పాటిదో తేలిపోయింది. సమగ్రమైన లెక్కలు ప్రజల ముందు ఉంచితే ప్రభుత్వం బాధ్యత మరింత పెరిగేది.

**ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగా కొన్ని కులాల జనాభాను పెంచినట్టుగా అనుమానాలు ఉన్నాయి. దీనిపై మీ వాదన ఏంటీ?**

ఉద్దేశపూర్వకంగా జనాభాను పెంచుకున్నారనే అంశంలో ఎలాంటి సందేహం లేదు. అయితే సర్వే రిపోర్టును బీసీలు ఒప్పుకునే పరిస్థితిలో లేరు. ఎక్కడికక్కడ ప్రభుత్వాన్ని నిలదీసేందుకు బీసీలు సిద్ధమవుతున్నారు.

**రాబోయే అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికలపై ఈ కులగణన ప్రభావం ఏమైనా ఉంటుందా..?**

కులగణనకు సీట్ల పెంపుదలకు సంబంధం లేదు. కేంద్ర ప్రభుత్వం 2025లోనే జనగణన చేస్తామంటున్నది. అయితే ఉత్తర భారతంలో జనాభా సంఖ్య గణనీయంగా పెరిగింది. వారితో పోలిస్తే దక్షిణాదిలో జనాభా శాతం తక్కువగా ఉండటం ఆందోళన కలిగిస్తున్నది. ఉత్తరాది జనాభా పెరిగితే వారికి సీట్ల సంఖ్య గణనీయంగా పెరిగి వారి ఆధిపత్యం మరింత పెరిగే అవకాశం ఉంటుంది.

**కులగణనపై మీ భవిష్యత్ కార్యాచరణ ఎలా ఉండబోతున్నది?**

కులగణన లోపాలపై ప్రజల్లో చైతన్యం కలిగించేందుకు విస్తృతంగా క్యాంపెయినింగ్ చేపడతాం. ఆయా వర్గాలను చైతన్యపరుస్తాం. బీసీల మూలాలను తుంచే ప్రయత్నం చేస్తున్న ప్రభుత్వ తీరును ఎండగడతాం.

**కులగణనతో ఏయే వర్గాలకు ఎలా నష్టం జరగనుంది?**

బీసీల సంఖ్య పెరిగితే తమకు దక్కాల్సిన న్యాయమైన వాటాను అడుగుతారనేది పాలకుల భయం. తమ వెనకబాటు, ఉద్యోగాలు, కాంట్రాక్టులు, ప్రభుత్వరంగాల్లో అవకాశాల ఇవ్వాలని డిమాండ్ చేస్తారు. కులాల లెక్కలు బయటపెడితే వారంతా చైతన్యమవుతారనే ప్రభుత్వం భావిస్తున్నట్టు కనిపిస్తున్నది. ఒకవేళ లెక్కలు బహిర్గతం చేయకుంటే వారంతా సైలెంట్ అవుతారనే కుట్ర ఇందులో దాగుంది. రాజకీయ చైతన్యం ఆయా కులాల్లో పెరుగుతుందని, అసమర్థ పథకాలపై ప్రశ్నించడం ప్రారంభమవుతుందన్న భయంతోనే ప్రభుత్వం సమగ్రంగా సర్వే రిపోర్టును వెల్లడించలేదని స్పష్టమవుతున్నది.

## 42% కోటా చట్టం తేవాలి

I తరువాయి...

ఆ చట్ట తేకుండా ఎన్నికలకు వెళ్తే కాంగ్రెస్ పార్టీ బీసీలకు తీరని ద్రోహం చేసినట్టేనని తేల్చి చెప్పారు. ఈ మేరకు మధుసూదనాచారి నేతృత్వంలోని బీఆర్‌ఎస్ ప్రతినిధి బృందం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి(సీఎస్)కి శనివారం వినతిపత్రం అందజేశారు. ప్రభుత్వం నిర్వహించిన కులగణన లోపభూయిష్టంగా ఉన్నదని, దాన్ని సవరించాలని సీఎస్‌ను కోరారు. ఈ ప్రతినిధి బృందంలో ఎంపీ వద్దిరాజు రవిచంద్ర, ఎమ్మెల్యేలు గంగుల కమలాకర్, మాజీ మంత్రి వీ శ్రీనివాస్‌గౌడ్, శాసనమండలి మాజీ చైర్మన్ స్వామిగౌడ్, మాజీ ఎమ్మెల్యేలు అంజయ్యయాదవ్, నోముల భగత్, రాష్ట్ర కార్పొరేషన్ మాజీ చైర్మన్లు పల్లె రవికుమార్, ఆంజనేయులుగౌడ్, బీసీ కమిషన్ మాజీ సభ్యులు కిశోర్, ఉపేంద్ర తదితరులు పాల్గొన్నారు. అనంతరం మధుసూదనాచారి మాట్లాడుతూ ప్రభుత్వం కులగణన పేరుతో బీసీలకు ద్రోహం చేసిందని విమర్శించారు. కులగణన పేరుతో బీసీలకు జరిగిన అన్యాయాన్ని ప్రభుత్వం సరిదిద్దుకోవాలని హితవు పలికారు. పాలన అంటే భక్షించడం, శిక్షించడం అని సీఎం రేవంత్‌రెడ్డి కొత్త భాష్యం చెప్పినట్టు వారి కార్యాచరణ కండ్లకు కడుతున్నదని పేర్కొన్నారు. తమిళనాడు తరహాలో బీసీ రిజర్వేషన్లు అమలు చేయాలని సూచించారు. కామారెడ్డి బీసీ డిక్లరేషన్‌పై చిత్తశుద్ధి ఉంటే కులగణన పేరుతో జరిగిన పొరపాటును సవరించుకోవాలని, లేదంటే బీసీలకు అండగా బీఆర్‌ఎస్ రాజీలేని పోరాటం చేస్తుందని హెచ్చరించారు.

**గ్రామాలవారీ గణన బయటపెట్టాలి: గంగుల**

గ్రామాలవారీగా చేపట్టిన కులగణన వివరాలను బయటపెట్టాలని మాజీ మంత్రి, ఎమ్మెల్యే గంగుల కమలాకర్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బీసీలను రాజకీయంగా అణగదొక్కేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కుట్రలు చేస్తున్నదని ధ్వజమెత్తారు. తప్పుల తడకగా ఉన్న కులగణనను సర్వేను వాస్తవిక సర్వేగా నమ్మించే ప్రయత్నం చేస్తే సహించేది లేదని హెచ్చరించారు. బీసీలకు కాంగ్రెస్ సర్కార్ ద్రోహం చేస్తే ఉధృతమైన పోరాటం చేస్తామని స్పష్టంచేశారు. కామారెడ్డి డిక్లరేషన్‌ను అమలు చేసేంతవరకూ ప్రభుత్వం వెంటపడతామని తేల్చిచెప్పారు. ప్రభుత్వం బేషజాలకు పోకుండా చేసిన తప్పులను సరిదిద్దుకోవాలని సూచించారు.



సచివాలయం మీడియా సెంటర్ వద్ద మాట్లాడుతున్న మండలిలో ప్రతిపక్ష నేత మధుసూదనాచారి. చిత్రంలో ఎంపీ రవిచంద్ర, మాజీ మంత్రులు కమలాకర్, శ్రీనివాస్‌గౌడ్, మండలి మాజీ చైర్మన్ స్వామిగౌడ్, మాజీ ఎమ్మెల్యే భగత్ తదితరులు

**రాష్ట్ర ప్రభుత్వ వైఖరిని పార్లమెంట్‌లో చర్చిస్తాం: ఎంపీ వద్దిరాజు**

బీసీల పట్ల రాష్ట్ర ప్రభుత్వం అనుసరిస్తున్న వైఖరిని పార్లమెంట్‌లో లేవనెత్తి చర్చకు పెడతామని రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర చెప్పారు. పీసీసీ ప్రెసిడెంట్ మహేశ్‌కుమార్ గౌడ్ సహా కాంగ్రెస్‌లో ఉన్న బీసీ వర్గాలు ప్రభుత్వం అనుసరిస్తున్న బీసీ వ్యతిరేక విధానాలను ఎండగట్టాలని హితవు పలికారు. 10 ఏండ్లకు పెరగాల్సిన బీసీ జనాభా ఎలా తగ్గిందని ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన బోగస్ సర్వేను ప్రజలెవరూ విశ్వసించడం లేదని చెప్పారు. తప్పుడు లెక్కలు చూపి బీసీలను అన్యాయానికి గురిచేస్తే కాంగ్రెస్ పార్టీ అందుకు తగిన మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని హెచ్చరించారు.

**చరిత్రహీనులవుతారు : శ్రీనివాస్‌గౌడ్**

**బీసీలను** అణచివేస్తే చరిత్రహీనులే అవుతారని మాజీ మంత్రి వీ శ్రీనివాస్‌గౌడ్ హెచ్చరించారు. కామారెడ్డి డిక్లరేషన్‌లో బీసీలకు ఇచ్చి హామీలను నిలబెట్టుకోకపోతే కాంగ్రెస్ నేతలను బీసీలు తరిమికొడ్తరని, గ్రామాల్లో తిరగనీయరని స్పష్టంచేశారు. బీసీలకు కాంగ్రెస్ కేటాయించిన మంత్రి పదవులే ఆ పార్టీకి ఉన్న చిత్తశుద్ధికి నిదర్శనమని పేర్కొన్నారు. బీసీలపై సర్కార్ భారీ కుట్ర చేస్తున్నదని ధ్వజమెత్తారు. తమిళనాడు తరహాలో రిజర్వేషన్లను అమలు చేయాలని కోరారు. 42%రిజర్వేషన్లు కల్పించాకే పంచాయతీ ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేశారు.

## నేడు బీఆర్‌ఎస్ బీసీ సమావేశం

I తరువాయి...



నేతలతో సమావేశమై కార్యాచరణను సిద్ధం చేయాలని నిర్ణయించింది. ఈ మేరకు హైదరాబాద్‌లోని బీఆర్‌ఎస్ రాష్ట్ర కార్యాలయమైన తెలంగాణ భవన్‌లో ఆదివారం బీఆర్‌ఎస్ బీసీ నేతల సమావేశం నిర్వహించనున్నారు. పార్టీ బీసీ విభాగం అధ్యక్షుడు, ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ అధ్యక్షతన ఉదయం 10 గంటలకు ఈ సమావేశం ప్రారంభం కానున్నది. రాష్ట్రంలో బీసీ కులగణన, స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42% రిజర్వేషన్ అమలు సాధనతోపాటు భవిష్యత్తు కార్యాచరణపై చర్చించనున్నారు. పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు కే తారక రామారావు హాజరై పార్టీ నేతలకు దిశానిర్దేశం చేయనున్నారు. ఈ సమావేశానికి శాసనమండలిలో ప్రతిపక్ష నేత సిరికొండ మధుసూదనాచారితోపాటు రాష్ట్రవ్యాప్తంగా ఉన్న బీసీ మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీలు, మాజీ ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్సీలు, రాష్ట్ర కార్పొరేషన్ల మాజీ చైర్మన్లు, జడ్పీ మాజీ చైర్‌పర్సన్లు, బీసీ కమిషన్ మాజీ సభ్యులు, ఇతర ముఖ్య నేతలు హాజరు కానున్నారు. ఎన్నికల ముందు కాంగ్రెస్ ప్రకటించిన కామారెడ్డి బీసీ డిక్లరేషన్ అమలు, బీసీలకు ప్రకటించిన సంక్షేమ పథకాల సాధనకు పార్టీ చేపట్టాల్సిన భవిష్యత్తు కార్యాచరణపై సమాలోచనలు చేయనున్నారు.

## బీసీ రిజర్వేషన్లు 42 శాతానికి పెంచాలి

- 50% సీలింగ్ అని తప్పించుకోవద్దు
- సీఎం రేవంత్‌కు ఆర్ కృష్ణయ్య లేఖ



హైదరాబాద్, ఫిబ్రవరి 8 (నమస్తే తెలంగాణ): స్థానిక సంస్థల ఎన్నికలలో బీసీ రిజర్వేషన్లను 42 శాతానికి పెంచాలని ఎంపీ, జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఆర్ కృష్ణయ్య కోరారు. ఈ మేరకు ఆయన శనివారం సీఎం రేవంత్ రెడ్డికి బహిరంగ లేఖ రాశారు. స్థానిక సంస్థల ఎన్నికలలో బీసీ రిజర్వేషన్లను 20 శాతం నుంచి 42 శాతానికి పెంచుతూ అసెంబ్లీలో బిల్లు ప్రవేశపెడతామని చెప్పి మాటతప్పారన్నారు. కామారెడ్డి డిక్లరేషన్‌లో లోక్‌సభ ప్రతిపక్షనేత రాహుల్ గాంధీ జనాభా ప్రకారం బీసీ రిజర్వేషన్లు కల్పిస్తామని హామీ ఇచ్చారని ఆయన గుర్తు చేశారు. బీసీ రిజర్వేషన్లు పెంచడానికి ప్రభుత్వానికి ఉన్న అడ్డంకులు ఏమిటో చెప్పాలని డిమాండ్ చేశారు. ఓ వైపు రిజర్వేషన్లు పెంచకుండా, మరో వైపు కులాల లెక్కలు తప్పుగా చూయిస్తూ సీఎం రేవంత్ ప్రజల దృష్టిని మరల్చే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. రిజర్వేషన్లను 42 శాతానికి పెంచుతూ అసెంబ్లీ చట్టం చేస్తే ఉన్న ఇబ్బందులు ఏమిటని ప్రశ్నించారు. న్యాయపరమైన చిక్కులు ఉంటే ఉమ్మడిగా పోరాటం చేసి సాధించుకుందాం అని పిలుపునిచ్చారు. సుప్రీం కోర్టు తీర్పు ప్రకారం 50శాతం సీలింగ్ అని చెప్పి తప్పించుకునే ప్రయత్నం చేయవద్దని హితవు పలికారు. ఇప్పటికే అగ్ర కులాలకు 10శాతం రిజర్వేషన్లు పెట్టి 50శాతం సీలింగ్‌పై పార్లమెంటు రాజ్యాంగ సవరణ చేసిందని పేర్కొన్నారు. అగ్రకులాలకు రిజర్వేషన్లు పెంచడానికి మూడు రోజులలో లోక్‌సభ, రాజ్యసభలో రాజ్యాంగ సవరణ చేసి రాష్ట్రపతి సంతకం చేశారని ఆయన గుర్తుచేశారు. కానీ 50శాతం జనాభా ఉన్న పేద కులాలకు రాజ్యాంగ సవరణ చేయరా..? అని ప్రశ్నించారు. అసెంబ్లీలో చట్టం చేసి 42 శాతం రిజర్వేషన్లు కల్పించవచ్చని, ఈ అంశంలో అన్ని పార్టీలు కలిసి రావడానికి సిద్ధంగా ఉన్నాయని స్పష్టం చేశారు. పార్లమెంట్‌లో రాజ్యాంగ సవరణ చేయాలని సూచించారు. లేని పక్షంలో గ్రామస్థాయి నుంచి ఉద్యమిస్తామని హెచ్చరించారు.

## బీసీ జనాభా తగ్గింపు వెనుక కుట్ర

**వెంటనే రీసర్వే నిర్వహించాలి • రాష్ట్ర కురుమ సంఘం ఉపాధ్యక్షుడు సంపత్**



హైదరాబాద్, ఫిబ్రవరి 8 (నమస్తే తెలంగాణ): కులగణన సర్వేలో ప్రభుత్వం బీసీల సంఖ్యను తగ్గించి చూపిందని రాష్ట్ర కురుమ సంఘం ఉపాధ్యక్షుడు సీవెల్లి సంపత్ ఆరోపించారు. ఎన్నికల ముందు కాంగ్రెస్ ఇచ్చిన హామీ మేరకు 42 శాతం కోటాతో స్థానిక ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. కేసీఆర్ హయాంలో చేపట్టిన సమగ్ర సర్వేలో 1.83 కోట్లు ఉన్న బీసీ జనాభా పదేండ్ల తర్వాత 1.62 కోట్లకు తగ్గిందనడం విడ్డూరమని చెప్పారు. కులగణన సర్వే నిర్వహణలో కాంగ్రెస్ విఫలమైందని మండిపడ్డారు. భేషజాలకు పోకుండా రీసర్వే నిర్వహించి, లోపాలను సరిదిద్దాలని, లేదంటే స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని హెచ్చరించారు.

**• సీఎం దిష్టిబొమ్మ దహనం**



ఎస్సీ వర్గీకరణను వ్యతిరేకిస్తూ నిజామాబాద్ జిల్లా వేల్పూర్ మండలం జాన్కంపేట్‌లో మాల సంఘం ఆధ్వర్యంలో శనివారం సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. పాలన చేతగాని రేవంత్‌రెడ్డి.. అబద్ధపు హామీలతో అన్నదమ్ముల్లా కలిసి ఉన్న మాల మాదిగలను విడదీస్తున్నారని ఆరోపించారు. -వేల్పూర్

# కులగణన చెల్లుబాటెంత?

I తరువాయి...


జనాభాగణన, సర్వే రెండూ వేర్వేరు. జనాభా గణన అంటే మొత్తం ప్రజల సమస్త సమాచారాన్ని సేకరించడం. సర్వే అనేది నిర్దేశిత లక్ష్యాలతో ఏదైనా ఒక అంశానికి సంబంధించి, మొత్తం జనాభాలో కొంతమంది శాంపిళ్లను ఎంపిక చేసుకుని నిర్వహించేది. అందుకు సంబంధించి దేశంలో రెండురకాల చట్టాలు ప్రస్తుతం అందుబాటులో ఉన్నాయి. జనాభా గణన అంశం అనేది 7వ షెడ్యూల్‌లో కేంద్ర ప్రభుత్వ జాబితాలోని అంశం.

**కేంద్ర ప్రభుత్వానికి అధికారం**

1948 చట్టం ప్రకారం జనాభా గణన చేపట్టే అధికారం కేవలం కేంద్రానికే ఉన్నది. ఎలాంటి జనగణన నిర్వహించేందుకు రాష్ట్ర ప్రభుత్వాలకు అధికారాలు లేవు. ఒకవేళ చేసినా ఆ గణాంకాలకు చట్టబద్ధత ఉండకపోవడమే గాక, అమలు చేసే అవకాశం కూడా లేదు. మరోవైపు కేంద్ర ప్రభుత్వమే గణాంకాల సేకరణ చట్టం 2008 ద్వారా రాష్ట్ర ప్రభుత్వాలకు డేటా సేకరణకు కొన్ని పరిమిత అధికారాలను బదలాయించింది. నిర్దేశిత అంశానికి సంబంధించి గణాంకాలను సేకరించే అధికారాన్ని రాష్ట్రాలతోపాటు, కేంద్రపాలిత ప్రాంతాలకు, ఆ తర్వాత పంచాయతీలు, మున్సిపాలిటీలకు సైతం అధికారాలను కల్పించింది. అదే సమయంలో కొన్ని షరతులను కూడా విధించింది. 2017లో ఈ చట్టానికి మరిన్ని సవరణలను కూడా చేసింది. 2008 చట్టం ద్వారా 7వ జాబితాలోని జనాభా గణనను నిర్వహించవద్దు. ఒకవేళ రాష్ట్రం నిర్వహించాలని భావించినా అందుకు కేంద్ర ప్రభుత్వం అనుమతి తప్పనిసరి. అంతేకాదు సేకరించిన డాటా వెల్లడిపైనా అనేక ఆంక్షలను విధించింది.

### నిబంధనలకు తిలోదకాలు

**కులగణన** అంశంపై రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం ఆది నుంచీ నిబంధనలన్నింటికీ తిలోదకాలిచ్చింది. బీహార్ ప్రభుత్వం తరహాలోనే ప్రణాళిక శాఖకు డాటా సేకరణ బాధ్యతలను అప్పగించింది. ఎందుకంటే డాటా సేకరణకు కావాల్సిన మానవ వనరులు, ఇతర వసతులు బీసీ కమిషన్‌కు లేవని చెప్తున్నది. అయినా బీసీ కమిషన్‌కు ప్రణాళిక శాఖను నోడల్‌కు ఏజెన్సీగా అనుసంధానం చేసే అవకాశం ఉన్నా ఆ పనిని ప్రభుత్వం చేయలేదు. పూర్తిగా డాటా సేకరణను ప్రణాళిక శాఖకే అప్పగించింది. ఈ మేరకు నవంబర్ 10న జీవో 18ని విడుదల చేసింది. ప్రణాళిక శాఖకు ఇచ్చిన ఆ ఉత్తర్వుల్లో ప్రభుత్వం స్పష్టమైన వివరాలను ఎక్కడా పేర్కొనలేదు. తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా సమగ్ర ఇంటింటి సర్వే (సామాజిక, విద్యా, ఆర్థిక, ఉపాధి, రాజకీయ, కులాల వారీగా) అని మాత్రమే పేర్కొన్నది. ఎందుకోసం చేస్తున్నామనేది కూడా ఎక్కడా పేర్కొనలేదు. నిరుడు ఫిబ్రవరిలో క్యాబినెట్, ఆపై అసెంబ్లీలో చేసిన తీర్మానాలను మాత్రమే రెఫరెన్స్‌గా ఇచ్చింది. దీంతో ప్రణాళిక శాఖకు ఇచ్చిన ఉత్తర్వులు సైతం అస్పష్టంగానే ఉన్నాయని బీసీ మేధావివర్గం మండిపడుతున్నది. ప్రణాళిక శాఖ డాటా సేకరణకు చట్టబద్ధత లేక పోగా, అధికారికంగా వినియోగించే పరిస్థితి కూడా ఉండబోదని బీసీ వర్గాలు, న్యాయకోవిదులు వివరిస్తున్నారు. అంతిమంగా సర్వే న్యాయస్థానాల ఎదుట చెల్లుబాటు కావడం కష్టమేనని అభిప్రాయపడుతున్నారు.



**ఇది జనాభా గణనే..**

రాష్ట్రంలో పేరుకు ఇంటింటి సమగ్ర సర్వే అని రాష్ట్ర ప్రభుత్వం చెప్తున్నా, రాష్ట్రవ్యాప్తంగా జనాభా గణననే నిర్వహించిందని మేధావి వర్గం భావిస్తున్నది. గణాంకాల సేకరణ చట్టం 2008 ప్రకారం సర్వే నిర్వహించాలన్న కూడా కొన్ని నిబంధనలను పాటించాల్సి ఉన్నది. 1952 రిజిస్ట్రార్ ఆఫ్ ఎంక్వయిరీస్ చట్టం ప్రకారం స్వయం ప్రతిపత్తి కలిగిన కమిషన్‌ను ఏర్పాటు చేయడంతోపాటు, గణాంకాల సేకరణకు ఒక ప్రభుత్వ శాఖను నోడల్ డిపార్ట్‌మెంట్‌గా నియమించడంతోపాటు, నోడల్ ఆఫీసర్‌ను, కమిషన్‌కు సెక్రటరీని నియమించాల్సి ఉంటుంది. నేషనల్ ప్లానింగ్, ఇంప్లిమెంటేషన్ డిపార్ట్‌మెంట్, స్టాటిస్టిక్స్ డిపార్ట్‌మెంట్, ఎన్‌ఎస్‌ఎస్‌వో తదితర విభాగాల నుంచి రాష్ట్రానికి చెందిన తాజా ఇండ్ల జాబితాను, బ్లాక్‌ల వారీ గా రూపొందించిన ఇండ్ల మ్యాపులను కూడా తీసుకోవాల్సి ఉం టుంది. ఇక సర్వే ప్రశ్నావళి రూపకల్పనకు సంబంధించి సలహాలు, సూచనలు ఇచ్చేందుకు ప్రత్యేకంగా నిపుణుల కమిటీని ఏర్పాటు చేయాల్సి ఉన్నది. సేకరించిన డాటాను కూడా అందుబాటులో ఉన్న ప్రామాణికమైన ఓటరు, ఆధార్ జాబితాలు, రేషన్‌కార్డుదారులు తదితర వాటితో విశ్లేషించాల్సి ఉన్నది. ప్రజల సామాజిక, ఆర్థిక, విద్యా, ఉద్యోగ ఉపాధి, రాజకీయ అవకాశాలకు సంబంధించిన స్థితిగతులను తులనాత్మక అధ్యయనం చేయాల్సి ఉన్నది. తుదకు అన్నింటినీ క్రోడీకరించి, విశ్లేషించి తుది నివేదికను రూపొందించాలి. క్యాబినెట్ ఆమోదం పొందాల్సి ఉన్నది. ఆ తర్వాత కేంద్రం ఆమోదంతో ఆ గణాంకాలను ప్రామాణికంగా పరిగణనలోకి తీసుకునే అవకాశం ఉంటుందని న్యాయకోవిదులు, నిపుణులు, బీసీ మేధావులు వెల్లడిస్తున్నారు.

**రాష్ట్రాలకు లేని జనాభా గణన అధికారం**

తెలంగాణ ఏర్పాటు అనంతరం బీఆర్‌ఎస్ ప్రభుత్వం సమగ్ర కుటుంబ సర్వే నిర్వహించిన విషయం తెలిసిందే. రాష్ట్రానికి జనాభా గణన నిర్వహించే అధికారాలు లేని కారణంగానే అందుకు సంబంధించిన వివరాలను నాటి ప్రభుత్వం వెల్లడించలేదు. కమిషన్లు కాకుండా ప్రభుత్వం సేకరించే డాటాకు సాధికారత ఉండబోదని న్యాయనిపుణులు, బీసీ మేధావులు వివరిస్తున్నారు. ప్రస్తుత సర్వే గణాంకాలు కూడా అటకెక్కే పరిస్థితి ఉన్నదని వివరిస్తున్నారు. కేంద్రం నిర్దేశించిన నమూనాలో రాష్ట్ర ప్రభుత్వం చిత్తశుద్ధితో సర్వే చేస్తే ఫలితం ఉంటుందని, న్యాయసమీక్ష ఎదుట నిలబడే అవకాశం ఉంటుందని బీసీ మేధావులు సైతం తేల్చిచెప్తున్నారు.

### బీహార్, మహారాష్ట్ర తరహాలో న్యాయచిక్కులు

కాంగ్రెస్ ప్రభుత్వం అడ్డదిడ్డంగా చేపడుతున్న, జారీ చేస్తున్న మార్గదర్శకాలతో న్యాయచిక్కులు కూడా తప్పవని బీసీ మేధావి వర్గాలు, న్యాయకోవిదులు హెచ్చరిస్తున్నారు. బీహార్‌తోపాటు, మహారాష్ట్రను ఉదహరిస్తున్నారు. గతంలో బీహార్ రాష్ట్ర సర్కారు నిర్వహించిన కులగణన కోర్టుకెక్కింది. బీహార్ ప్రభుత్వం రాష్ట్ర ప్రణాళికశాఖ ఆధ్వర్యంలో కులగణన నిర్వహించింది. ఓబీసీలు, ఎస్సీ, ఎస్టీల లెక్కలను తీసింది. అందుకు అనుగుణంగా రిజర్వేషన్ల శాతాన్ని మొత్తంగా 65 శాతానికి పెంచింది. ఈడబ్ల్యూఎస్ కోటా కలుపుకుంటే ఆ రిజర్వేషన్లు 75 శాతానికి పెరిగింది. ఇది 50 శాతం కోటా పరిమితిని మించిపోతున్నదని, బీహార్ రాష్ట్రం నిర్వహించిన కులగణన చెల్లుబాటు కాదని, ఆ అధికారాలు లేవని అభ్యంతరాలు వ్యక్తంచేస్తూ అనేక మంది పాట్నా హైకోర్టు, సుప్రీంకోర్టును ఆశ్రయించారు. దీంతో ఆ రాష్ట్రంలో రిజర్వేషన్ల అమలు మళ్లీ మొదటికి వచ్చింది. మహారాష్ట్ర ప్రభుత్వం సైతం ట్రిపుల్ టెస్ట్ మార్గదర్శకాలకు విరుద్ధంగా డెడికేషన్ కమిషన్‌ను కాదని, డాటా సేకరణ బాధ్యతలను అక్కడి పంచాయతీరాజ్ శాఖకు అప్పగించింది. తుదకు సుప్రీంకోర్టు అడ్డు చెప్పడంతో మళ్లీ కమిషన్ ద్వారానే చేయించింది.

## అసంబద్ధంగా ఎస్సీ వర్గీకరణ

- లోపాలను సవరించాలి
- రిజర్వేషన్ 18 శాతానికి పెంచాలి
- భీమ్ ఆర్మీ రాష్ట్ర చీఫ్ వనం మహేందర్ డిమాండ్

హైదరాబాద్, ఫిబ్రవరి8 (నమస్తే తెలంగాణ): ఎస్సీ వర్గీకరణ సుప్రీంకోర్టు మార్గదర్శకాలకు విరుద్ధంగా ఉన్నదని, ఫలితంగా కొన్ని ఉప కులాలకు తీవ్ర అన్యాయం జరిగే ప్రమాదమున్నదని భీమ్ ఆర్మీ రాష్ట్ర చీఫ్ వనం మహేందర్ తెలిపారు. వర్గీకరణ తీరును పునః సమీక్షించాలని, లోపాలను సవరించి అందరికీ న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. శనివారం ఆయన హైదరాబాద్‌లోని భీమ్ ఆర్మీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ 'రేవంత్ సర్కార్ చేపట్టిన ఎస్సీ వర్గీకరణలో అనేక లోపాలున్నాయి. ఎస్సీలను మూడు గ్రూపులుగా వర్గీకరించడం సరైంది కాదు. దీని వల్ల కొన్ని ఉప కులాలు మరింత వెనుకపడిపోయే ప్రమాదమున్నది. జనాభా, వెనుకబాటుతనం, అభివృద్ధి అంశాలను ప్రామాణికంగా తీసుకొని వర్గీకరణ చేయాలని సూచించారు. అప్పుడే అందరికీ న్యాయం జరుగుతుందని మహేందర్ చెప్పారు. ప్రస్తుతమున్న 15 శాతం రిజర్వేషన్‌ను 18 శాతానికి పెంచాలని డిమాండ్ చేశారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న వనం మహేందర్